సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 17 । డిసెంబర్ । 2024



విజ్ఞాన కేంద్రం ఓ మణిపూస

పేరుకు తగ్గట్టు 'కృషి' విజ్ఞాన కేంద్రం వెలుగులు నలుదిశలా విరజిమ్ముతున్నాయి.

వివరాలు 8లో ▸



రుణమాఫీ కావట్లేదు

రైతు రుణమాఫీ పొందలేకపోతున్నామని నూరారానికి చెందిన రైతు దుర్గపతి, అతని భార్య నిరసన తెలిపారు.

వివరాలు 8లో ▸



పూర్తి చేయరు.. ప్రారంభించరు!

గ్రామాల్లో గత ప్రభుత్వం ఫంక్షన్ హాళ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టింది. కానీ చాలా చోట్ల నిర్మాణ పనులు ఐదేళ్లుగా కొన సాగుతూనే ఉన్నాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

నాణ్యమైన భోజనం అందించాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



కేజీబీవీ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వ, కస్తూర్బాగాంధీ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డీఈఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని భవానందాపూర్ ప్రాథమిక,, మర్కూక్‌లో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భోజన విషయంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. అలాగే చదువులో వెనుకబడిన పిల్లలను గుర్తించి ఏ బీ సీ విభాగాలుగా విభజించి విద్యను అందించాలని సూచించారు. పురుగులు పట్టిన బియ్యం ఉంటే వెంటనే తిరిగి పంపాలన్నారు. పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఆయన వెంట ఎంఈఓ వెంకట్‌రాములు పాల్గొన్నారు.

మల్లారెడ్డికి ఎస్పీగా పదోన్నతి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట అడిషనల్ డీసీపీ (శాంతి భద్రతలు)గా విధులు నిర్వహిస్తున్న మల్లారెడ్డి పదోన్నతి పొందారు. ఈ మేరకు హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మల్లారెడ్డిని రాచకొండ ట్రాఫిక్ డీసీపీగా బదిలీ చేశారు.

రవీందర్‌కు జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న కుంభాల రవీందర్

దుబ్బాక: వినియోగదారుల ఫోరం జిల్లా అధ్యక్షుడు కుంభాల రవీందర్ సేవారత్న 2024 జాతీయ అవార్డును అందుకున్నారు. సోమవారం ఢిల్లీలో జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 17వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో బీఎస్పీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ అవార్డును అందజేశారు. దుబ్బాక మండలం చీకోడ్‌కు చెందిన రవీందర్ విద్యార్థి దశలోనే పేద, పీడిత ప్రజల కోసం పీపుల్స్‌వార్ పార్టీలో చేరి 10 సంవత్సరాలకు పైగా అంకితభావంతో పనిచేశారు. ఫోరం జిల్లా అధ్యక్షుడిగా అవినీతి, నిత్యావసర వస్తువుల కల్తీ, దోపిడీకి వ్యతిరేకంగా పోరాడుతూ ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న రవీందర్ సేవలను గుర్తించి జాతీయ స్థాయిలో సేవారత్న అవార్డును అందించారు. ఈ అవార్డుతో నాపై మరింతగా బాధ్యత పెరిగిందని రవీందర్ చెప్పారు.

వెండి కవచాల బహూకరణ



వెండి కవచాలు అందజేస్తున్న భక్తులు

కొమురవెల్లి(సిద్దిపేట): పోచమ్మ, ఎల్లమ్మ అమ్మవార్లకు వెండి కవచాలు, స్వామివారి నివేదన తయారీకి రూ. 3లక్షల విలువైన ఫర్నిచర్‌ను హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌కు చెందిన కుమార్‌యాదవ్ పద్మావతి దంపతులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్, ఆలయ పర్యవేక్షకులు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు, అర్చకులు సాంబయ్య, అంజనేయులు, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

విత్ డ్రా లేకుంటే మోసమే

సంగారెడ్డి జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్‌రెడ్డి

పటాన్‌చెరు టౌన్: ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో మనం డబ్బులు చెల్లించడమే తప్ప, నగదు ఉపసంహరణ (విత్ డ్రా) చేసుకునేందుకు అవకాశం ఉండదని జిల్లా సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఒకవేళ విత్ డ్రా అవకాశం ఉన్నా కేవలం రూ.5 వేల లోపే ఉంటుందని ఆపైన మీరు ఎంత పెట్టినా మోసపోయినట్లే అని గుర్తుంచుకోవాలని సూచించారు. అధిక లాభాల కోసం ఎవరూ ఆశ పడకూడదని... ఆన్‌లైన్ వ్యాపారాలు, ఇన్వెస్ట్‌మెంట్ల జోలికి వెళ్ల కూడదని తెలిపారు. సైబర్ నేరాల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతే వెంటనే 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి తెలిపారు. నగదు పోగొట్టుకున్న గంట వ్యవధిలో(గోల్డెన్ అవర్) సమాచారం ఇస్తే నగదు తిరిగిపొందే అవకాశముంటుందని వివరించారు.

నాల్గోసారి నజరానా

హుస్నాబాద్‌కు జాతీయ స్థాయి అవార్డు

- స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ఫలితాలు
- చెత్తతో నూతన వస్తువుల ఆవిష్కరణ
- సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ
- చేంజ్ మేకర్స్ కన్‌క్లేవ్ అవార్డుకు ఎంపిక



రవికుమార్‌కు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న రజిత, కమిషనర్ మల్లికార్జున్

హుస్నాబాద్: జాతీయ అవార్డుతో హుస్నాబాద్‌కు మరోసారి ఢిల్లీలో గుర్తింపు లభించింది. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మూడు సార్లు జాతీయ అవార్డులను సొంతం చేసుకున్న హుస్నాబాద్ మున్సిపాలిటీ.. నాలుగోసారి ఎంపికై ంది. చెత్తతో నూతన వస్తువులు ఆవిష్కరించడంతో మొదలుకొని కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా స్వచ్ఛత కార్యక్రమాలు, సాలిడ్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గాను మున్సిపాలిటీ 'చేంజ్ మేకర్స్ కన్‌క్లేవ్'అవార్డుకు ఎంపికైంది.

మరోసారి జాతీయ స్థాయి గుర్తింపు

స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్న మున్సిపాలిటీలపై ప్రైవేట్ ఏజెన్సీలు సర్వే నిర్వహించాయి. దేశ వ్యాప్తంగా 4,800 మున్సిపాలిటీలు ఉండగా, వాటిలో 450 మున్సిపాలిటీలను గుర్తించి శిక్షణ ఇచ్చారు. వాటిలో 2021నుంచి 2024వరకు సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వంద మున్సిపాలిటీలను ఎంపిక చేశారు. రాష్ట్రంలో 20 మున్సిపాలిటీలను ఎంపిక చేయగా.. అందులో సిద్దిపేట, హుస్నాబాద్ మున్సిపాలిటీలను చేంజ్ మేకర్స్ కన్‌క్లేవ్ అవార్డులకు ఎంపిక చేశారు.

సీఎస్ఈ (సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్), ఎంఓహెచ్‌యూఏ (మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ అఫైర్స్) సంయుక్తంగా ఢిల్లీలో ఈ నెల 19న చేంజ్ మేకర్స్ కార్యక్రమం నిర్వహించనున్నారు. స్వచ్ఛ్‌భారత్ మిషన్ జాయింట్ సెక్రెటరీ, నేషనల్ మిషన్ డైరెక్టర్ డాక్టర్ రూపామిశ్రా చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నారు.

చెత్తతో నూతన వస్తువులు

వాడి పడేసిన ప్రతి వస్తువును ఏదో రూపంలో ఉపయోగించుకోవచ్చు. తాగి పడేసిన టీ కప్పులు, కూల్‌డ్రింక్ బాటిళ్లతో కొత్త ఆవిష్కరణలు చేశారు. బాటిళ్లతో పడవగా తయారు చేసి చెరువులో విహరించేలా రూపకల్పన చేశారు.



కూల్‌డ్రింక్ బాటిళ్లతో తయారు చేసిన బోటు

ప్రజల భాగస్వామ్యంతోనే అవార్డులు

జాతీయస్థాయిలో హుస్నాబాద్ మున్సిపాలిటీకి ఇప్పటి వరకు నాలుగు అవార్డులు రావడం సంతోషంగా ఉందని మున్సిపల్ చైర్ పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, పారిశుద్ధ్య కార్మికుల కృషి వల్లనే అవార్డులు వచ్చాయన్నారు. ఢిల్లీలో ప్రదానం చేసే అవార్డును అందుకునేందుకు పర్యావరణ ఇంజనీర్ రవికుమార్‌ను పంపిస్తున్నట్లు వారు తెలిపారు.

స్వచ్ఛతలో మెరుగైన ఫలితాలు

హుస్నాబాద్‌లో 20 వార్డులు, 7,533 ఇళ్లు, 30,353 జనాభా ఉంది. ప్రతిరోజు ఇళ్ల నుంచి 9.5 మెట్రిక్ టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. తడిచెత్తతో సేంద్రియ ఎరువును తయారుచేసి మొక్కలకు వాడుతున్నారు. అలాగే తడి చెత్త, పొడి చెత్త, హానికరమైన చెత్తను వేరు చేసే విధానంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. తద్వారా ప్రజలు నేరుగా తడి చెత్త నుంచి ఎరువు తయారు చేసేలా ప్రోత్సహిస్తున్నారు. ప్లాస్టిక్ వసువులను వాడకుండా బట్ట సంచులను వినియోగించుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. ఇలా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వచ్ఛత కార్యక్రమాలు నిర్వహిస్తూ మెరుగైన ఫలితాలు సాధిస్తూ మున్సిపాలిటీ ఆదర్శంగా నిలిచింది.



తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, కమిషనర్ మల్లికార్జున్

ఏడాదిలో ఒక్కపైసా ఇస్తే ఒట్టు

- దుబ్బాకపై ప్రభుత్వానికి ఎందుకింత వివక్ష
- కలెక్టర్, అధికారులు ఫోన్లు లిఫ్ట్ చేయడం లేదు
- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ధ్వజం



అసెంబ్లీలో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక: ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజక వర్గాలపై ప్రభుత్వం వివక్ష చూపడం ఎంత వరకు సమంజసమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. తన నియోజకవర్గ సమస్యలపై ప్రస్తావించారు. ఈ ఏడాది కాలంలో దుబ్బాక నియోజకవర్గానికి నయాపైసా నిధులు కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లు పూర్తిగా అధ్వాన్నంగా ఉన్నాయని, దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అనేక మంది ప్రాణాలు పోతున్నాయని చెప్పారు. రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరు చేయాలని మంత్రులను కలిసి విన్నవించినా పలు సార్లు లేఖలు రాసినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. పలు సమస్యలపై కలెక్టర్, ఉన్నతాధికారులకు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదన్నారు. ప్రభుత్వం తమపై ఎందుకింత కక్షపూరితంగా వ్యవహరిస్తుందో అర్థంకావటం లేదన్నారు. బ్యాలెన్స్ వర్క్‌లకు కూడా కనీసం లక్ష, రెండు లక్షలు కూడా ఇవ్వడం లేదన్నారు. నియోజకవర్గంలో రెండు విద్యుత్ స్తంభాలు కూడా ఇచ్చేందుకు నిధులు లేకపోవడం దారుణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ చరిత్రలోనే ఏడాది కాలంలో ఒక్క పైసా నిధులివ్వని ప్రభుత్వంగా నిలుస్తుందన్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వానికి ఏదైనా కోపం ఉంటే తమపై చూపాలని, ఇలా నిధులు ఇవ్వకుండా ప్రజలను ఇబ్బందుల పాలు చేయడం సరికాదన్నారు.

కల్తీ పదార్థాలు విక్రయిస్తే చర్యలు

జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష

సిద్దిపేట: పాలు, ఆహార పదార్థాల విక్రయాల్లో నాణ్యత పాటించాలని జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష పేర్కొన్నారు. సిద్దిపేట పట్టణంలోని పలు పాల విక్రయ కేంద్రాలు, హోటళ్లు, ఇతర ఆహార పదార్థాల విక్రయ కేంద్రాలను సోమవారం తనిఖీ చేశారు. పలు కేంద్రాల్లోని పాల శాంపిల్స్‌ను సేకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హోటళ్లు, దాబాలు, రెస్టారెంట్ల నిర్వాహకులు నాణ్యమైన ఆహార పదార్థాలను విక్రయించాలన్నారు. ప్రజల ఆరోగ్యానికి హాని చేసే కల్తీ నూనెలు, రంగులు వంటివి వినియోగించినా, పాలు కల్తీ చేసి విక్రయించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలను విక్రయించే వారిపై కేసులు నమోదు



పాల కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అనూష

సగం మంది గైర్హాజరు

గ్రూపు–2 పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో టీజీపీఎస్సీ గ్రూప్–2 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. రెండో రోజు కూడా గ్రూప్– 2 పరీక్షకు సగం మందే హాజరయ్యారు. మూడవ పేపర్‌కు 13,717మందికిగాను 6,869మంది హాజరుకాగా 6,848 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన నాల్గవ పేపర్‌కు 6,899 మంది హాజరయ్యారు. 6,818 మంది వివిధ కారణాలతో గైర్హాజరయ్యారు. మొత్తంగా రెండు పేపర్లకు సగం మంది మాత్రమే హాజరు కావడం విశేషం. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు. ఒక్క నిమిషం నిబంధనలు పక్కాగా అమలు చేశారు. ఆయా కేంద్రాల్లో 10 మంది నిర్దీత సమయం దాటిన తర్వాత రావడంతో నిబంధనల మేరకు వారిని వెనక్కి పంపించారు. నారాయణ, మాడ్యులస్, శ్రీవాణితోపాటు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను కలెక్టర్ మను చౌదరి తనిఖీ చేసి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు.



పరీక్ష కేంద్రంలో కలెక్టర్ మను చౌదరి

జాతీయస్థాయి పోటీలకు నవోదయ టీమ్

ఫిబ్రవరి 4, 5న పోటీలు

వర్గల్(గజ్వేల్): జాతీయస్థాయి యూత్ పార్లమెంట్ పోటీలకు సిద్దిపేట జిల్లా వర్గల్ నవోదయ టీమ్ ఎంపికైంది. సెప్టెంబర్ 12న వర్గల్ నవోదయ వేదికగా ఎంపీ రఘునందన్‌రావు సమక్షంలో జరిగిన రీజియన్ స్థాయి పోటీల్లో స్థానిక నవోదయ యూత్ పార్లమెంట్ టీమ్‌లో పార్లమెంట్ స్పీకర్‌గా వైష్ణవి, ప్రధానిగా ఆదినాథ్, ప్రతిపక్ష నాయకునిగా అభినవ్‌తో కలిపి మొత్తం 55మంది విద్యార్థులు వివిధ పాత్రలు పోషించారు. మాక్ పార్లమెంట్ సెషన్ ఆవిష్కరిస్తూ రైతు ఆత్మహత్యలు, వాయనాడ్‌లో ప్రకృతి ప్రకోపం, ఎం వైరస్ నివారణ, ఆర్థిక ప్రగతి, నవోదయ లక్ష్యాలు, పెన్షన్ విధానం తదితర అనేక అంశాలను చర్చించారు. క్వశ్చన్ అవర్, బిల్లుల తీర్మానం, ఆమోదం చేస్తూ ఆకట్టుకున్నారు. ఈ పోటీలో చక్కని ప్రతిభతో రీజియన్‌స్థాయి నుంచి వర్గల్ నవోదయ టీమ్ జాతీయస్థాయి పోటీలో పాల్గొనే అర్హత సాధించిందని విద్యాలయ ప్రిన్సిపాల్ దాసి రాజేందర్ వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలు ఫిబ్రవరి 4,5 తేదీలలో నాగపూర్, పుణె రీజియన్లలో జరుగుతాయని తెలిపారు. జాతీయస్థాయికి తమ టీమ్ ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



మాక్ పార్లమెంట్ సెషన్ నిర్వహిస్తున్న వర్గల్ నవోదయ టీమ్ (ఫైల్)

స్థానిక మార్కెట్ల అభివృద్ధికి ప్రాధాన్యం

కొండా లక్ష్మణ్ ఉద్యాన వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రాజిరెడ్డి

ములుగు(గజ్వేల్): రైతులు షేడ్ నెట్లులో కూరగాయలు సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని, సబ్సిడీపై వాటిని అందించేలా ప్రభుత్వానికి నివేదిస్తామని ములుగు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ దండా రాజిరెడ్డి అన్నారు. సోమవారం విశ్వవిద్యాలయంలోని అయన చాంబర్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూరగాయల ఉత్పత్తుల మార్కెటింగ్ సమస్యను గమనిస్తున్నామన్నారు. షేడ్ నెట్లుతో సాగు ద్వారా సంవత్సరం పొడవునా కూరగాయల దిగుబడులు సాధించవచ్చునన్నారు. జిల్లాలవారీగా ఎక్కడి కూరగాయలు అక్కడే విక్రయించుకునేలా లోకల్ మార్కెట్‌ల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కూరగాయల హెచ్చుతగ్గుల కారణంగా తెలంగాణలో కూరగాయల సాగు తగ్గుతోందన్నారు. కోల్డ్ స్టోరేజీలు ఈ సమస్యకు పరిష్కారంగా నిలుస్తాయన్నారు. పంట కోతకు ముందు, కోత తర్వాత చేపట్టాల్సిన ప్రీ అండ్ పోస్ట్ హార్వెస్ట్ పద్ధతుల ద్వారా ఉద్యాన రైతులు అధిక ఉత్పత్తులు సాధించేలా చైతన్య పరుస్తామన్నారు. హైదరాబాద్‌లో పూల విస్తరణకు ఎంతో అవకాశం ఉందని తెలిపారు. తెలంగాణలో గణనీయంగా తగ్గుతున్న బత్తాయి సాగుపై ప్రత్యేక దృష్టి సారిస్తామని చెప్పారు. కొత్తగా హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్లను నెలకొల్పడానికి ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ డీడీకి ప్రతిపాదనలు పంపామన్నారు. ములుగు మండలం కొట్యాలలో ఉన్న రీసెర్చ్ ఫామ్‌లో కూరగాయలు, పండ్ల మొక్కలు, పూలమొక్కలను పెంచి మోడల్ రీసెర్చ్ ఫామ్‌గా అభివృద్ధి చేస్తామన్నారు.



మాట్లాడుతున్న వీసీ రాజిరెడ్డి

సాధారణ ప్రసవాలు పెంచాలి

డీఎంహెచ్ఓ పల్వన్‌కుమార్

కోహెడ/అక్కన్నపేట(హుస్నాబాద్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే ప్రజలను ప్రేమతో పలకరించాలని జిల్లా వైద్యాధికారి పల్వన్‌కుమార్ అన్నారు. కోహెడ, అక్కన్నపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు, పని తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాధారణ ప్రసవాల సంఖ్యను పెంచాలని సూచించారు. కోవిడ్ లక్షణాలు ముందుగా గుర్తించి సంబంధించిన మందులను ఆరోగ్య కేంద్రంలో భద్రపరచుకోవాలన్నారు. ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నిషియన్లు రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. హాస్టల్, పాఠశాలలను సందర్శించి వంటగది, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు, వార్డెన్‌లకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి శుక్ర, మంగళవారాల్లో డ్రైడే నిర్వహించాలని తెలిపారు. సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ నారాయణరావు, మండల వైద్యాధికారి నిర్మతరుణం, రమ్య తదితరులు పాల్గొన్నారు.



కోహెడలో మాట్లాడుతున్న పల్వన్ కుమార్

స్వచ్ఛతలో ఆదర్శంగా నిలబెట్టాలి



డంప్ యార్డును సందర్శించి సూచనలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీని స్వచ్ఛతలో ఆదర్శంగా నిలబెట్టడానికి అంతా సహకరించాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి కోరారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పిడిచెడ్ రోడ్డు వైపున ఉన్న డంపింగ్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తను వేరు చేసే విధానాన్ని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య లోపాన్ని నివారించడానికి సంబంధిత అధికారులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. యూజీడీకి చెందిన ఎస్‌టీపీ(సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)ను సైతం సందర్శించి నిర్వహణ తీరును పరిశీలించారు. మున్సిపల్ ఏఈ మహేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

డాకూరు భూ కబ్జాపై నివేదిక ఇవ్వండి

రెవెన్యూ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

జోగిపేట(అందోల్): 'ఆధార్ మార్చి...కబ్జా చేసి'రూ.12 కోట్ల విలువైన భూమి హాంఫట్‌కు సంబంధించిన 'సాక్షి' కథనం సోమవారం ప్రచురితం కావడంతో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్పందించారు. ఈ కథనం స్థానికంగా కలకలం రేపింది. భూ కబ్జా వ్యవహారంకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి నివేదికను అందజేయాలని అందోల్ మండల రెవెన్యూ అధికారులకు సోమవారం ఆదేశాలు జారీ చేసినట్లు తహసీల్దారు విష్ణుసాగర్ 'సాక్షి'కి తెలిపారు. భాస్కరరావు మరణ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డులను సేకరించేందుకు ఆయన కుటుంబ సభ్యులకు ఫోన్ చేయగా వారు స్పందించడం లేదని వివరించారు. ఈ విషయమై పూర్తి వివరాలతో రెండు రోజుల్లో కలెక్టర్‌కు నివేదిక అందజేస్తానని తెలిపారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ శోభారాణి

రామాయంపేట(మెదక్): విద్యార్థుల శ్రేయస్సుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బండ్రు శోభారాణి పేర్కొన్నారు. మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుతో కలసి ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... స్కూళ్లలో నేడు నాణ్యమైన భోజనం వండి వడ్డిస్తున్నారని, విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కాస్మెటిక్, మెస్ చార్జీలను పెంచిన ప్రభుత్వం విద్యార్థులకు అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారు విద్యార్థులతో కలసి భోజనం చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఆంజనేయులు, పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు యుగంధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న శోభారాణి, మైనంపల్లి హన్మంతరావు

క్లుప్తంగా

కార్మికుడి మృతి

మనోహరాబాద్(తూప్రాన్): ప్రమాదవశాత్తు కార్మికుడు మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బిహార్ రాష్ట్రానికి చెందిన రాహుల్ రాజ్ (23) మనోహరాబాద్ మండలం రంగాయపల్లి శివారులోని ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఆదివారం పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ వార్తను ఎస్‌ఐ సుభాశ్ గౌడ్ ధ్రువీకరించారు. తనకు ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు రాగానే పూర్తి వివరాలు తెలియస్తామన్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి

- మాజీ సర్పంచ్‌లు



మాట్లాడుతున్న మాజీ సర్పంచ్‌లు

సిద్దిపేటజోన్: ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని నియోజకవర్గ మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ సర్పంచ్‌లు ఎల్లయ్య, ఉమేశ్ చంద్ర, ఆంజనేయులు, పర్శరాములు గౌడ్ మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ సర్పంచ్‌ల పట్ల కక్ష కట్టిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు ఓటమి చెందే అవకాశం ఉందని, ఆ భయంతోనే బిల్లులు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రజల్లో ఆపార్టీకి ఆదరణ లేకపోవడం కూడా ఒక కారణమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే హరీశ్‌రావు సర్పంచ్‌ల పక్షాన బిల్లులు విడుదల చేయాలని కోరితే ప్రభుత్వం పొంతన లేని జవాబు చెప్పిందని విమర్శించారు. తమకు రావాల్సిన బిల్లులను వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాక అప్పులకు వడ్డీ కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో పలు గ్రామాల మాజీ సర్పంచ్‌లు అజీజ్, నవీన్, రవీందర్ గౌడ్, భిక్షపతి పాల్గొన్నారు.

ధర్నాకు తరలిరండి

తొగుట(దుబ్బాక): తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 18న ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ దూలం యాదగిరిగౌడ్ సోమవారం కోరారు. విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ పోస్టుల్లో కన్వర్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులు 24 గంటలు కష్టపడి పని చేస్తున్నారన్నారు. దీంతో రాష్ట్రంలో నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ప్రభుత్వానికి ఎన్నిమార్లు సమస్యలు విన్నవించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మొండివైఖరిని విడనాడి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మికులు పెద్ద ఎత్తున ఇందిరా పార్కు వద్ద నిర్వహించే ధర్నాకు తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

ఒరిగిన పైకప్పు..

వర్గల్(గజ్వేల్): వర్గల్ జెడ్పీహైస్కూల్ వద్ద రోడ్డు వైపు పైకప్పు ఒరిగి వేలాడుతోంది. మరొకటి దెబ్బతింది. విద్యార్థులు, బాటసారులపై పడక ముందే మేల్కొనాల్సి ఉంది. ఈ విషయం హెచ్ఎం వెంకటేశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా చర్యలు చేపడతామన్నారు.



ఒరిగిపోయిన పైకప్పు (వృత్తంలో)

జాతీయ సోషల్ మీడియా కోకన్వీనర్‌గా మధు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్ఎఫ్ఐ) జాతీయ సోషల్ మీడియా కోకన్వీనర్‌గా చంద్లాపురం మధును నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి సోమవారం తెలిపారు. విజయవాడలో జరిగిన అఖిల భారత వ్యవస్థాపక మహాసభల్లో ఈ మేరకు ప్రకటించినట్లు తెలిపారు.

విజ్ఞాన కేంద్రం ఓ మణిపూస

2018లో వెబ్‌కాస్ట్ ద్వారా ప్రారంభించిన ప్రధాని

- సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంలో రైతులకు శిక్షణ
- చీడపీడల నివారణపై పరిశోధనలు
- కషాయాల కనికట్టుతో.. చీడపీడలకు చెక్ పెడ్తూ..
- కత్తెర పురుగుకు మట్టితో మట్టుబెట్టి
- అలోవెరా సబ్బుల తయారీ ప్రత్యేకం
- 'కృషి'లో.. శిగలెన్నో..
- 25న కేవీకేకు రానున్న ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్

పేరుకు తగ్గట్టు 'కృషి' విజ్ఞాన కేంద్రం వెలుగులు నలుదిశలా విరజిమ్ముతున్నాయి. మార్చి17, 2018 నాడు ప్రధాని మోదీ చేతులమీదుగా పురుడు పోసుకుంది. అక్కడి నుంచే కృషికి నిర్వచనంగా మారింది. సేంద్రియం, ప్రకృతి వ్యవసాయానికి సంకల్పం చేబూని శిక్షణ ఇస్తూ రైతులను మేటిగా తయారు చేస్తోంది. కషాయాల తయారీకి కేరాఫ్‌గా అడ్రస్‌గా మారింది. నీమ్ ఆయిల్, తూటాకు, వావిలాకు కషాయం, అగ్నిఅస్త్రంలను సిద్ధం చేసుకొని చీడపీడల నివారణకు కృషి చేస్తోంది. మొక్కజొన్న రైతులకు నిద్రలేకుండా చేస్తున్న కత్తెర పురుగును మట్టితో మట్టుబెట్టిన ఘనత దీని సొంతం. అంతే కాదు అలోవెరా సబ్బులు సైతం తయారు చేస్తోంది. ప్రకృతి వ్యవసాయ సేద్యంలో రైతుకు తర్ఫీదు ఇస్తూ అభ్యున్నతికి బాటలు వేస్తోంది. ఉపరాష్ట్రపతి జగదీప్‌ధన్‌ఖడ్ రానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం..

కౌడిపల్లి(నర్సాపూర్): కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలోని తునికి వద్ద గల డాక్టర్ డీ రామానాయుడు ఏకలవ్య గ్రామీణ వికాస ఫౌండేషన్ కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) మార్చి17, 2018న ప్రధాని మోదీ వెబ్‌కాస్ట్ ద్వారా ప్రారంభించారు. అప్పటి నుంచి సేంద్రియ, ప్రకృతి సాగుతో పాటు పరిశోధనలు సైతం జరుగుతున్నాయి. కేవీకేలో సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ శంభాజీ దత్తాత్రేయ నల్కర్ ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు రవి కుమార్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, ఉదయ్ కుమార్, భార్గవి, పూర్తిగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయం పద్ధతులలో సాగు చేస్తూ రైతులకు శిక్షణ ఇస్తున్నారు.

30 ఎకరాల స్థలంలో పంటల సాగు

తునికి వద్ద గల డాక్టర్ డీ రామానాయుడు వృద్ధాశ్రమంలోని 65 ఎకరాల స్థలంలో 33 ఎకరాలు విజ్ఞాన జ్యోతి వ్యవసాయ విద్యాసంస్థకు ఇచ్చారు. మరో 30 ఎకరాలను కేవీకేకు ఇచ్చారు. దీంతో ఆ స్థలంలో కేవీకే సేంద్రియ సాగును చేస్తోంది. కాగా వ్యవసాయ యువ శాస్త్రవేత్తలతోపాటు వ్యవసాయ విద్యచదివిన అనుభవం ఉన్న సిబ్బందిని నియమించి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఇక్కడ మొక్కజొన్న, కంది, మామిడి, పెద్దజనుము, టమాట, వంకాయ, కూరగాయలు, బొప్పాయి, అలవేర, పసుపు, మునగ పంటలను సాగు చేస్తున్నారు. స్థానిక రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. అలోవెరా సబ్బును సైతం తయారు చేస్తోంది.

జీవాంమృతం ఇతర కషాయాల తయారీ

పంటల సాగు భూసారం పెరిగేందుకు, చీడపీడల నివారణ కోసం ఎరువులు, కషాయాలు ఇక్కడే తయారు చేస్తున్నారు. భూసారం కోసం పశువుల పేడ, ఆవు మూత్రంతో, జీవాంమృతం, బీజాంమృతం తయారు చేసి వాడుతున్నారు. చీడపీడల నివారణ కోసం నీమ్ ఆయిల్, తూటాకు, వావిలాకు కషాయం, అగ్నిఅస్త్రం తదితర వాటిని తయారు చేసి వాడుతున్నారు.

కత్తెర పురుగుకు నివారణ ఇలా..



గతంలో మొక్కజొన్న పంటపై సోకిన కత్తెర పురుగు (లద్దెపురుగు)ను కేవలం మట్టితో నివారించవచ్చని గతంలో ఇక్కడ పనిచేసిన శాస్త్రవేత్త శ్యాంసుందర్‌రెడ్డి క్షేత్రస్థాయిలో నిరూపించారు. దీంతో రైతులందరికీ ఈ విషయం తెలియాలని నాటి కలెక్టర్ ధర్మారెడ్డిని కేవీకే క్షేత్రానికి పిలిపించి కత్తెర పురుగును నివారించిన పద్ధతులను వివరించారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరిగింది.



కేవీకేలో కూరగాయల సాగు



25న ఉపరాష్ట్రపతి రాక

కేవీకేకు ఈనెల 25న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రులు రానున్నారు. దీని కోసం ఇప్పటికే కలెక్టర్, ఎస్పీ పరిశీలన చేశారు. కేంద్ర సెక్యూరిటీ బృందం సైతం పరిశీలనకు రానున్నట్లు సమాచారం.

సేంద్రియ సాగు చేయాలి



ప్రతీ రైతు సేంద్రియ, ప్రకృతి సాగు చేయాలి. ఈ పంటలు ఆరోగ్యానికి ఎంతో మంచింది. వీటికి డిమాండ్ బాగా పెరిగింది. ఇంటి పంట చేతి వంట ఎంతో మంచిది. కేవీకే వ్యవసాయ క్షేత్రంలో సేంద్రియ సాగుపై రైతులు ఎప్పుడు వచ్చినా సూచనలు సలహాలు ఇస్తాం. గ్రామాల్లో సైతం అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం.

– శంభాజీ దత్తాత్రేయ నల్కర్, కేవీకే హెడ్ అండ్ సైంటిస్ట్

దశదినకర్మకు వెళ్తుండగా ప్రమాదం

- కారును ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- తల్లి మృతి, కొడుకుకు తీవ్రగాయాలు



ప్రమాదస్థలంలో కారు, ఆర్టీసీ బస్సు



గాయపడిన శ్రావణి



చికిత్స పొందుతున్న లతిక్

గజ్వేల్‌రూరల్: ఆర్టీసీ బస్సు కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో తల్లి మృతిచెందగా, కొడుకుకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ శివారు ఔటర్ రింగురోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... హైదరాబాద్‌లోని దమ్మాయిగూడ ప్రాంతానికి చెందిన మోతె సుధాకర్, శ్రావణి దంపతులు. వారికి సాయి, లతిక్‌లు సంతానం. సమీప బంధువు చనిపోవడంతో సోమవారం జరిగే దశదినకర్మకు హాజరయ్యేందుకు సోదరుడు గణేశ్‌తో పాటు భార్య శ్రావణి(38)లు పిల్లలు సాయి, లతిక్‌లతో కలిసి సుధాకర్ కారులో మిరుదొడ్డికి బయలుదేరారు. జగిత్యాల డిపోకు చెందిన ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు హైదరాబాద్(జేబీఎస్) నుంచి జగిత్యాల వైపు 60 మంది ప్రయాణికులను తీసుకెళ్తోంది. రాజీవ్ రహదారిపై ప్రజ్ఞాపూర్ దాటిన తర్వాత ఔటర్ రింగురోడ్డు వద్ద కారును క్యాసారం వైపు వెళ్లేందుకు మలుపు తిప్పడంతో వెనుక నుంచి వచ్చిన ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో శ్రావణి, లతిక్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. సుధాకర్, గణేశ్, సాయిలకు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకొని క్షతగాత్రులను గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శ్రావణి మృతిచెందింది. మెరుగైన చికిత్స కోసం క్షతగాత్రులను వంటిమామిడి సమీపంలోని ఆర్‌వీఎం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సైదా తెలిపారు.

జేసీబీ, బైక్ ఢీకొని తీవ్ర గాయాలు

తూప్రాన్: జేసీబీ, బైక్ ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనదారుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని సోమవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ యాదగిరి తెలిపిన వివరాలిలా ఉన్నాయి... శివ్వంపేట మండలం కొంతన్‌పల్లికి చెందిన బట్టు వెంకటేశ్ ద్విచక్ర వాహనంపై తూప్రాన్ వెళ్తున్నాడు. వట్టూరు గ్రామ సమీపంలో జేసీబీ, ద్విచక్ర వాహనాలు ఢీకొన్నాయి. దీంతో వెంకటేశ్ కాలు తెగి పడింది. స్థానికులు సమాచారం మేరకు 108లో కొంపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. బాధి తుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు.



బోల్తా పడిన లారీ

వడ్ల లారీ బోల్తా

వెల్దుర్తి(తూప్రాన్): ప్రమాదభరితంగా ఉన్న మలుపు వద్ద సోమవారం లారీ బోల్తా పడింది. ఎం.జలాల్‌పూర్, మంగళపర్తి గ్రామాల మధ్యలో నర్సాపూర్ నుంచి వెల్దుర్తి వైపు వడ్ల లోడ్‌తో వస్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తా పడగా లారీ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు.

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి మృతి

కొండాపూర్(సంగారెడ్డి): రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన సోమవారం ఉదయం 65వ జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. కొండాపూర్ ఎస్సై హరిశంకర్ గౌడ్ కథనం ప్రకారం.. సదాశివపేట మండలం నాగ్‌సాన్‌పల్లి వాసి రాహుల్ (20).. తన సోదరిని సంగారెడ్డిలోని రాజంపేటలో గల ఆమె ఇంట్లో దింపి ద్విచక్ర వాహనంపై తిరిగొస్తున్నాడు. ఉదయం 8.30 నిమిషాల ప్రాంతంలో కిష్టయ్య గూడెం వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టింది. దీంతో రాహుల్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడని ఎస్సై తెలిపారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్లే ప్రమాదం జరిగిందని మృతుడు తండ్రి మల్లయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

మిరుదొడ్డి(దుబ్బాక): కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతెలో సోమవారం జరిగింది. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి యాదగిరి (65)కి భార్య, ఇద్దరు కుమారులున్నారు. యేడాది క్రితం వ్యవసాయ భూమి అమ్మగా వచ్చిన రూ. 3.50 లక్షలను పెద్ద కొడుకు రమేశ్‌కు ఇచ్చాడు. నెల క్రితం ధాన్యం విక్రయించగా వచ్చిన రూ. 50 వేలను భార్య, చిన్న కొడుకు రవిలకు ఇచ్చాడు. ఈ డబ్బుల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. తరచుగా ఇరుగు పొరుగు వారితో చెప్పుకుని బాధ పడుతుండేవాడు. సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. యాదగిరి చిన్నమ్మ కొడుకు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న భూంపల్లి ఎస్‌ఐ హరీశ్ తెలిపారు.



యాదగిరి (ఫైల్)

బావ ఆత్మహత్య తట్టుకోలేక..

– బావమరిది కూడా ఉరేసుకొని...

మనోహరాబాద్(తూప్రాన్): బావ మృతితో మనోవేదనకు గురైన బావమరిది ఇంట్లో ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన నల్ల పెంటయ్య కుమారుడు నవీన్ (15) స్థానిక ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. 45 రోజుల క్రితం ములుగు మండలం తిమ్మాపురంలో ఉంటున్న అక్క భర్త రాజు ఆత్మహత్య చేసుకున్నాడు. ఆయన మృతిని తట్టుకోలేక లోలోన మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం తన కుటుంబీకులు కూలీ పనులకు వెళ్లారు. అతను మాత్రం స్కూల్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి రేకుల రాడ్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చెట్టంత కొడుకు చేజారిపోయాడు..

- మీరిచ్చే లక్ష ఏం చేసుకోవాలయ్యా..
- మిన్నంటిన తల్లి రోదనలు
- కాగ్నానదిలో స్నానానికి వెళ్లి యువకుడి మృతి



రాహుల్ మృతదేహం



ధారూరు: రోదిస్తున్న కుటుంబీకులు

ధారూరు: చేతికొచ్చిన కొడుకే పోయాక.. మీరిచ్చే లక్ష రూపాయలు ఏం చేసుకోవాలని ఓ తల్లి గుండెల విసేలా రోదించింది. తన కుమారుడిని జాతరకు తీసుకు వచ్చి అన్యాయంగా పొట్టన పెట్టుకున్నారని కన్నీటి పర్యంతమైంది. ఏఎస్‌ఐ సంగమేశ్వర్ తెలిపిన ప్రకారం.. సంగారెడ్డి జిల్లా కోహీర్‌కు చెందిన స్వీటీ, శరత్ దంపతుల పెద్ద కుమారుడు రాహుల్(20) కొత్తూరుకు చెందిన పిల్లి నర్సింహులు టెంట్‌హౌస్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. కోహీర్‌కు చెందిన సందీప్‌కుమార్ ఆదివారం తన కూతురు పుట్టు వెంట్రుకలు వేడుక కోసం ధారూరులోని మెథడిస్ట్ జాతర ప్రాంగణంలోని క్రీస్తు శిలువ వద్దకు వెళ్లాడు. తనకు చేదోడుగా ఉంటాడనే ఉద్దేశంతో కూలి ఇచ్చి రాహుల్‌ను తీసుకెళ్లాడు. మధ్యాహ్నం వేళ కాగ్నానదిలో స్నానం చేసేందుకు వెళ్లాడు. నదిలో దూకిన సమయంలో నీళ్లలోని బండరాయి తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గంట దాటినా తిరిగి రాకపోడంతో సందీప్ కుమార్ నది ఒడ్డుకు వెళ్లిచూస్తే దుస్తులు కనిపించాయి. మనిషి ఎక్కడని వెతికి.. ఒకవేళ నీటిలో మునిగిపోయి ఉంటాడని భావించి, పోలీసులకు సమాచారం ఇచ్చాడు. వారు ఇక్కడకు చేరుకొని ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా మృతదేహం ఆచూకీ దొరకలేదు. సోమవారం కోట్‌పల్లి ప్రాజెక్టు బోటింగ్ లైఫ్ గార్డ్స్ శవాన్ని బయటకు తీశారు. రాహుల్ తల్లికి రూ.లక్ష ఇస్తానని సందీప్ చెప్పడంతో డబ్బులు ఏం చేసుకోవాలని కన్నీటి పర్యంతమైంది. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ యత్నం కేసులో రిమాండ్

చేగుంట(తూప్రాన్): దొంగతనానికి యత్నించిన నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ చైతన్య కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మక్కరాజీపేటకు చెందిన స్వామిగౌడ్ ఇంట్లో ఈనెల 14న రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి ప్రయత్నించారు. స్వామిగౌడ్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టగా సయ్యద్ మహమూద్, సుమేర్, మునీర్‌లు చోరీకి ప్రయత్నించినట్లు తేలింది. వారికి అబ్దుల్ సత్తార్.. గ్రామంలో ఆశ్రయం కల్పించినట్లు గుర్తించారు. ఆ మేరకు నలుగురిని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టపగలే చోరీ

- ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, నగదు తస్కరణ

కంగ్టి(నారాయణఖేడ్): పట్టపగలు ఇంటి కి వేసిన తాళం పగులగొట్టి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన సంఘటన కంగ్టి మండలం దెగుల్‌వాడిలో సోమవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన బాధితుడు ధన్‌రాజ్ తన తల్లితో పాటు వ్యవసాయ పనుల నిమిత్తం పంటచేలకు వెళ్లారు. భార్య రమాదేవి అంగన్‌వాడీ టీచర్. విధి నిర్వహణలో భాగంగా సెంటర్‌కు వెళ్లారు. ఇంటికి తాళం వేసింది చూసి ఇదే అదనుగా భావించిన గుర్తుతెలియని దుండగులు దాన్ని పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాను సైతం పగలగొట్టి మూడు బంగారపు రింగులు, మంగళసూత్రంతో పాటు దాదాపు రూ.1.50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. చోరీకి గురైన బంగారం 5.5 తులాల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు. ధన్‌రాజ్ ఫిర్యాదుతో ఎస్‌ఐ విజయ్‌కుమార్ సంఘటన స్థలం పరిశీలించారు. ఆ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



ఘటనా జరిగిన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బంది

డెత్‌సర్టిఫికెట్ సృష్టించి మోసం

- రైతుల పేరిట ఉన్న రూ. 10 లక్షల బీమా డ్రా
- బాగోతం వెనుక రాజకీయ నాయకుడు
- ఏఓ ఫిర్యాదుతో మెదక్‌లో వెలుగుచూసిన ఘటన

మెదక్‌జోన్ : బతికున్న ఇద్దరు రైతులు చనిపోయినట్లుగా డెత్‌సర్టిఫికెట్ సృష్టించారు. వారి పేరిట ఉన్న బీమా సొమ్ము కాజేశారు. ఈ ఘటన మెదక్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు... మెదక్ జిల్లా గుట్టకిందిపల్లికి చెందిన ఓ రాజకీయ నేత ఇదే గ్రామంలో నివాసం ఉంటున్న ఇద్దరు రైతులు ఉండగా వారిలో 2021లో ఒకరు, 2023లో మరొకరు చనిపోయినట్లు ఆ గ్రామ పంచాయతీ సెక్రటరీతో కుమ్మక్కయి మరణ ధ్రువీకరణ సృష్టించాడు. ఈ రైతుల కుటుంబ సభ్యులను సైతం ఒప్పించడం విశేషం. అలా ఒప్పుకున్నందున గాను కొంత నగదు ముట్టజెప్పాడు. దీంతో ఈ విషయాన్ని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులకు ఫోన్ ద్వారా మెసేజ్‌లు పెట్టాడు. వారు సైతం చనిపోయినట్లుగా భావించి ఇద్దరు పేరిట ఉన్న రూ.10 లక్షలు నామినీలకు మంజూరు చేశారు. వచ్చిన బీమా డబ్బుల్లో సదరు నేత సగభాగం తీసుకుని మిగతాది పంచాడు. ఏఅధికారి వచ్చి విచారించినా గానీ ఇద్దరు చనిపోయారని చెప్పాలని సూచించాడు.

బయట పడిందిలా...

తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించి రూ.10 లక్షలను స్వాహా చేసిన నేత గుట్టకిందిపల్లి గ్రామంలో మరికొంత మందికి ఆ సొమ్ము పంచి తన వైపు తిప్పుకున్నాడు. వచ్చే సర్పంచ్ ఎన్నికల్లో పోటీచేస్తున్నానని మద్దతు ఇవ్వాలని చెబుతున్నాడు. ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి ఇదే పదవికి తానూ పోటీ చేస్తున్నానన్నాడు. ఈ విషయమై వారిద్దరి మధ్యగొడవ జరిగింది. బీమా విషయంలో జరిగిన బాగోతాన్ని వ్యవసాయ శాఖ అధికారులకు తెలిపాడు. గ్రామంలో ఆరా తీయగా వారు ఇద్దరు బతికే ఉన్నారని తెలుసుకున్నారు. మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో విషయం బయటకు వచ్చింది.

కేసు విచారణలో ఉంది

గుట్టకిందిపల్లి గ్రామంలో రైతులు చనిపోయినట్లుగా నన్ను నమ్మించారు. దీంతో ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాను. వారిద్దరి పేరిట రూ.10 లక్షలు రాగా నామినీలకు అందజేశాం. తరువాత ఇదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వారు చనిపోలేదని సమాచారం ఇచ్చారు. దీంతో విచారిస్తే బతికే ఉన్నట్లు తేలింది. మెదక్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. కేసు విచారణలో ఉంది.

: భార్గవి, ఏఓ

రుణమాఫీ కావట్లేదు

కలెక్టరేట్ ఎదుట భార్యాభర్తల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న భార్యాభర్తలు

మెదక్ కలెక్టరేట్: వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పొందలేకపోతున్నామని మండలంలోని సూరారానికి చెందిన రైతు దంపతులు దుర్గపతి, పెంటమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలంటూ కలెక్టరేట్ ఎదుట సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ నిబంధనలకు అనుకూలంగా ఉన్నా.. వ్యవసాయ అధికారులు తమకు న్యాయం చేయడం లేదని ఆరోపించారు. 4 ఎకరాల పొలం ఉండగా, ఎస్‌బీఐ బ్యాంకులో 1.94లక్షల రుణం తీసుకున్నామని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.2లక్షల మాఫీకి తాము అర్హులమని తెలిపారు. వ్యవసాయ అధికారుల వద్దకు వెళితే బ్యాంకులో ఆధార్‌లింక్ లేదని చెప్పారు. బ్యాంకులో మాత్రం లింకు ఉందని చెబుతున్నారన్నారు. ఇటీవల ధాన్యం అమ్మిన డబ్బులు అకౌంట్‌లో జమ కాగా బ్యాంకు అధికారులు ఇన్‌స్టాల్ మెంట్ రూ.25 వేలు కట్ చేసుకున్నట్లు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యంతో తాము మాఫీ పొందలేక పోతున్నామని కలెక్టర్ స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు.

చెవిలో పువ్వులతో ఉద్యోగుల నిరసన



చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

సిద్దిపేటరూరల్: సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరవధిక సమ్మె 7వ రోజైన సోమవారం కలెక్టరేట్ ఎదుట చెవిలో పువ్వులు పెట్టుకొని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నామన్నారు. గత సంవత్సరం పీసీసీ అధ్యక్షుడి హోదాలో వచ్చి రేవంత్ రెడ్డి వరంగల్ వేదికగా జరుగుతున్నటువంటి దీక్షా శిబిరానికి వచ్చి అధికారంలోకి వచ్చిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ఇచ్చిన హామీని నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమానికి బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఐలేశ్ యాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోప్పరి శ్రీనివాస్, సిద్దిపేట ప్రధాన కార్యదర్శి పిడిశెట్టి రాజు, బీజేపీ జిల్లా నాయకులు చంద్రం, జిల్లా అధ్యక్షుడు జాలిగాం బాలకిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి డ్యాగ నవీన్ కుమార్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.